
సీపీఎస్‌ను వెంటనే రద్దు చేయాలి


2



2

కార్యదర్శి వివాదాస్పద వ్యాఖ్యలు

AKSHARA TODAY
అక్షర టుడే
TOWARDS... TRUTH. TRUST. TREND
www.aksharatoday.in

## అతిథి అధ్యాపక పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

**అక్షరటుడే, బాన్సువాడ:** బాన్సువాడ ఎస్ఆర్ఎన్‌కే ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో 2025 26 విద్యా సంవత్సరానికి గాను అతిథి అధ్యాపక పోస్టులకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ గంగాధర్ తెలిపారు. అర్హులైన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. తెలుగు, ఇంగ్లీష్ మీడియంలో కంప్యూటర్ అప్లికేషన్, కామర్స్ సబ్జెక్టులలో పోస్టులు ఖాళీగా ఉన్నాయని పేర్కొన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు ఈనెల 2న సాయంత్రం నాలుగు గంటల్లోగా దరఖాస్తులను కళాశాలలో అందజేయాలన్నారు. 3న కామారెడ్డి ఆర్ట్స్ అండ్ సైన్స్ డిగ్రీ కళాశాలలో ఇంటర్వ్యూలు ఉంటాయని తెలిపారు. సెట్, నెట్, పీహెచ్‌డీ అనుభవం కలిగిన అభ్యర్థులకు ప్రాధాన్యత ఉంటుందని పేర్కొన్నారు.




వినతులు స్వీకరిస్తున్న కలెక్టర్ వినయ్‌కృష్ణారెడ్డి, అధికారులు

## ప్రజావాణికి జిల్లా అధికారులు గైర్హాజరు కావొద్దు: కలెక్టర్

**అక్షరటుడే, ఇందూరు:** ప్రజా సమస్యల సత్వర పరిష్కారం కోసం ప్రతి సోమవారం నిర్వహిస్తున్న ప్రజావాణికి జిల్లా అధికారులు విధిగా హాజరుకావాలని కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డి పేర్కొన్నారు. కలెక్టరేట్ లో ఆయన సోమవారం ప్రజావాణిలో భాగంగా మాట్లాడారు. ఎంతో కీలకంగా భావించే ప్రజావాణికి జిల్లాస్థాయి అధికారులు హాజరుకాకపోతే సమస్యల పరిష్కారం మరింత ఆలస్యం అవుతుందన్నారు. అత్యవసరమైతే తన అనుమతి తీసుకుని కిందిస్థాయి అధికారిని ప్రజావాణికి పంపాలని సూచించారు. సోమవారం మొత్తం 74 వినతులు అందాయి. పలుశాఖ అధికారులు గైర్హాజరు కావడంపై కలెక్టర్ అసంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు అంకిత్, కిరణ్ కుమార్, డీఆర్డీవో సాయాగౌడ్, నగరపాలక సంస్థ కమిషనర్ దిలీప్ కుమార్, డీపీవో శ్రీనివాస్ రావు, మెప్మా పీడీ రాజేందర్, ఏసీపీ రాజా వెంకట్ రెడ్డి, కలెక్టరేట్ ఏవో ప్రశాంత్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.




## నిజాంసాగర్ పటిష్టమైన ప్రాజెక్టు

**అక్షరటుడే, బాన్సువాడ:** భారీ వరదలు వచ్చినా నిజాంసాగర్ ప్రాజెక్టు పటిష్టంగా ఉందని వ్యవసాయ సలహాదారు, ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. పోచారం, ఘన్‌పూర్‌ల నుంచి భారీగా వరద నీరు రావడంతో ప్రాజెక్టు గేట్లు ఎత్తి నీరు మంజీరలోకి వదులుతుండడంతో సోమవారం నిజాంసాగర్ ప్రాజెక్టును పరిశీలించారు. ఈ సందర్భంగా ప్రాజెక్టులోకి భారీగా వరద నీరు వచ్చిన నేపథ్యంలో ప్రాజెక్టు ఇంజినీర్లను వివ రాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా పోచారం మాట్లాడుతూ దేవుని దయ వల్ల ఈ ఏడాది కూడా నిజాంసాగర్ ప్రాజెక్టు పూర్తి స్థాయిలో నిండిందన్నారు. పంటలకు ఇబ్బంది లేకుండా సాగునీరు అందించవచ్చన్నారు. రైతులు సాగునీటిని సక్రమంగా వినియోగించుకోవాలని సూచించారు. బకొ రెండు, మూడు రోజుల్లో భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ హెచ్చరికల నేపథ్యంలో అధికారులు అప్రమత్తంగా ఉండాలన్నారు. మంజీరలోకి భారీగా నీటిని విడుదల చేసే క్రమంలో పరీవాహక ప్రజలను అప్రమత్తం చేయాలని తెలిపారు. ఆయన వెంట ఆగ్రో ఇండస్ట్రీస్ ఛైర్మన్ కాసుల బాలరాజ్, మున్సిపల్ మాజీ ఛైర్మన్ జంగం గంగాధర్, నార్ల సురేష్, ఎజాజ్, స్థానిక నాయకులు ఉన్నారు.

**స్థానిక సంస్థల ఎన్నిలకు త్వరలో నగారా మోగనుంది. ఏళ్లుగా పాలకవర్గాలు లేక పంచాయతీలు, మండల, జిల్లా పరిషత్‌లు వెలవెలబోతున్నాయి. జీపీల్లో పాలన అస్తవ్యస్తంగా మారింది. ఈ క్రమంలో ఈ నెల 10 తర్వాత స్థానిక ఎన్నికల నోటిఫికేషన్ వెలువడుతుందని మంత్రులు ప్రకటన చేయడంతో గ్రామాల్లో సందడి నెలకొంది. ఈ నెలాఖరులోగా ఎన్నికలు నిర్వహిస్తామని చెప్పడంతో ఆశావహులు పోటీ కోసం ప్రయత్నాలు ప్రారంభించారు.**

- అక్షరటుడే, ఇందూరు/కామారెడ్డి



# స్థానిక పోరుకు సన్నద్ధం

**▸ నెలాఖరులోగా ఎన్నికలు! ▸ త్వరలో షెడ్యూల్ విడుదలయ్యే అవకాశం ▸ పోటీకి ఆశావహుల ప్రయత్నాలు ▸ రిజర్వేషన్లపై ఉత్కంఠ**

ఉమ్మడి జిల్లాలోని పల్లెల్లో స్థానిక ఎన్నికల సందడి నెలకొంది. కొంతకాలంగా ప్రజలు ఎన్నికల కోసం ఎదురు చూస్తున్నారు. పంచాయతీ పాలకవర్గాల కాలం గతేడాది ఫిబ్రవరిలో అయిపోయింది. అప్పటి నుంచి గ్రామాలు ప్రత్యేకాధికారుల పాలనలో ఉన్నాయి. అయితే వారు పట్టించుకోకపోవడంతో పాలన అస్తవ్యస్తంగా మారింది. దీంతో పంచాయతీ ఎన్నికలు నిర్వహించాలని ప్రజలు ఎప్పటి నుంచో కోరుతున్నారు. మరోవైపు ఎంపీటీసీ, జెడ్పీటీసీ పదవీ కాలం అయిపోయి కూడా ఏడాది అవుతోంది.

### ఎన్నికల సంఘం కసరత్తు

పంచాయతీ ఎన్నికల నిర్వహణకు ఎన్నికల సంఘం కసరత్తు చేస్తోంది. ఇప్పటికే పంచాయతీ ఎన్నికల కోసం ఓటర్ల జాబితా ముసాయిదాను విడుదల చేసి, అభ్యంతరాలను స్వీకరించింది. ఈ నెల 2న తుది జాబితా ప్రకటించనుంది. అలాగే 6న ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికలకు ఓటరు జాబితా ముసాయిదా విడుదల చేయనుంది. 10న తుది జాబితాతో పాటు, పోలింగ్ స్టేషన్ల వివరాలు ప్రకటించనుంది.

### రిజర్వేషన్లు తేలితేనే..

స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీ చేయడానికి చాలా మంది ప్రయత్నిస్తున్నారు. అయితే బీసీ రిజర్వేషన్ల సమస్య కొలిక్కిరాకపోవడం, తమ గ్రామంలో ఏ రిజర్వేషన్ వస్తుందో తెలియక ఆశావహులు ఆందోళన చెందుతున్నారు. ముందుగా ప్రచారం ప్రారంభిస్తే.. తీరా రిజర్వేషన్ రాకపోతే ఎలా అని ఆలోచిస్తున్నారు. అయితే బీసీ రిజర్వేషన్లపై సోమవారం అఖిలపక్షం గవర్నర్‌ను కలిసింది. బీసీ రిజర్వేషన్లకు ఆమోదం లభిస్తే.. నోటిఫికేషన్ వెలువడే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది.

### పార్టీల సమాయత్తం

ఉమ్మడి జిల్లాలో స్థానిక ఎన్నికల్లో సత్తా చాటడానికి మూడు ప్రధాన పార్టీలు యత్నిస్తున్నాయి. కాంగ్రెస్, బీజేపీ, బీఆర్ఎస్ స్థానిక ఎన్నికల్లో మెజారిటీ సీట్లు సాధించేలా వ్యూహాలు రచిస్తున్నాయి. ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకు వెళ్లాలని కాంగ్రెస్ భావిస్తుండగా.. యూరియా కొరత, వరద కష్టాలపై ప్రజలకు అవగాహన కల్పించి సీట్లు సాధించాలని బీఆర్ఎస్ యత్నిస్తోంది. మరోవైపు బీజేపీ సైతం స్థానిక పోరులో విజయకేతనం ఎగురవేయాలని చూస్తోంది. ఈ మేరకు జిల్లా నాయకులు పలు గ్రామాల్లో పర్యటించి ప్రజల సమస్యలను తెలుసుకుంటున్నారు.

| నిజామాబాద్ జిల్లాలో స్థానిక సంస్థల వివరాలు | కామారెడ్డి జిల్లాలో.. |
|---|---|
| పంచాయతీలు 545 | పంచాయతీలు 532 |
| వార్డు స్థానాలు 5022 | వార్డు స్థానాలు 4656 |
| ఎంపీటీసీ స్థానాలు 307 | ఎంపీటీసీ స్థానాలు 233 |
| జెడ్పీటీసీ స్థానాలు 31 | జెడ్పీటీసీ స్థానాలు 25 |

### మొదట ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికలు

స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణకు ఇటీవల కేబినెట్ ఆమోదం తెలిపింది. ఈ మేరకు ఎన్నికల సంఘానికి లేఖ కూడా రాసింది. అలాగే ఇటీవల మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి మాట్లాడుతూ.. ఈ నెల 10 తర్వాత ఎప్పుడైనా నోటిఫికేషన్ వెలువడే అవకాశం ఉందన్నారు. మొదట ఎంపీటీసీ, జెడ్పీటీసీ స్థానాలకు ఎన్నికలు నిర్వహించి, అనంతరం సర్పంచ్ ఎలక్షన్లు పెడతామని తెలిపారు. సెప్టెంబర్ 30లోపు ఎన్నికలు పూర్తి చేస్తామని ఆయన పేర్కొన్నారు.

## తెలంగాణ ప్రతీక ఖైరతాబాద్ గణేశ్ మండలి



**అక్షరటుడే, ఇందూరు:** ఖైరతాబాద్ గణేశుడు తెలంగాణకే ప్రతీకగా నిలబడిందని అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ గుప్తా అన్నారు. ఎమ్మెల్యేలు పాయల్ శంకర్, పాల్వాయి హరీష్, రామారావు పాటిల్‌తో కలిసి సోమవారం ఖైరతాబాద్ వినాయకుడిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. దేశంలోనే అత్యంత ఎత్తయిన ఉత్సవ విగ్రహంగా ఖైరతాబాద్ పేరుపొందిందన్నారు. హిందూ ధర్మ సంస్కృతి, సాంప్రదాయాలకు ప్రతీకంగా నిలుస్తుందని ఆయన స్పష్టం చేశారు. అనంతరం ఎమ్మెల్యేలను ఉత్సవ కమిటీ సభ్యులు సన్మానించారు.

## రేపు విద్యుత్ సరఫరాలో అంతరాయం

**అక్షరటుడే, ఇందూరు:** నగరంలోని పలు ప్రాంతాల్లో మంగళవారం విద్యుత్ అంతరాయం ఏర్పడనున్నట్లు టౌన్ ఏడీఈ చంద్రశేఖర్ తెలిపారు. పెద్ద బజార్ చౌరస్తా నుంచి గోల్ హనుమాన్ వరకు విద్యుత్ సరఫరాలో కోత విధించనున్నట్లు పేర్కొన్నారు. గణపతి నిమజ్జనం సమయంలో విగ్రహాలకు విద్యుత్ తీగలు అడ్డుతగలకుండా ఎత్తు పెంచడానికి నూతన స్తంభాలు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. కావున మధ్యాహ్నం 12 గంటల నుంచి 4 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని పేర్కొన్నారు.



## గణేశ్ నిమజ్జనానికి ఏర్పాట్లు పూర్తి చేయాలి

**అక్షరటుడే, బోధన్:** పట్టణంలో గణేశ్ నిమజ్జనానికి ఏర్పాట్లు పూర్తి చేయాలని బోధన్ సబ్ కలెక్టర్ వికాస్ మహతో అధికారులను ఆదేశించారు. ఈ మేరకు సోమవారం డివిజన్ అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నిమజ్జనం సందర్భంగా రోడ్లపై ఉన్న గుంతలను తక్షణమే పూడ్చివేయించాలని సూచించారు. అలాగే నిమజ్జన యాత్ర రూట్‌లో అడ్డుగా ఉన్న చెట్లకొమ్మలను తొలగించాలని.. కరెంట్ తీగలను సరిచేయాలని విద్యుత్‌శాఖ అధికారులకు సూచించారు. వినాయక విగ్రహాలను నిమజ్జనం చేసే చెరువు వద్ద గజ ఈతగాళ్లను ఏర్పాటు చేయాలని కోరారు. వారు ఎల్లవేళలా అలర్ట్‌గా ఉండేలా స్థానిక అధికారులను అప్రమత్తం చేయాలని ఆయన సూచించారు. సమీక్షలో బోధన్ ఏసీపీ శ్రీనివాస్, తహశీల్దార్ విఠల్, తదితరులు పాల్గొన్నారు.

## ఆర్మూర్ ఆర్టీసీ డిపోకు రాజధాని ఏసీ బస్సులు

**అక్షరటుడే, ఆర్మూర్:** ఆర్మూర్ ఆర్టీసీ డిపోకు రెండు రాజధాని ఏసీ బస్సులకు మంజూరైనట్లు డిపో మేనేజర్ రవికుమార్ తెలిపారు. ఈ బస్సులను ఆర్మూర్ డిపో నుంచి శంషాబాద్ విమానాశ్రయానికి వెళ్లే ప్రయాణికుల సౌకర్యార్థం ఈ నెల 3 నుంచి రాజధాని బస్సులను నడపనున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఆర్మూర్ నుంచి సాయంత్రం 6.15 గంటలకు, రాత్రి 9.30 గంటలకు ఆర్మూర్ నుంచి బయలుదేరుతుందన్నారు. ప్రయాణికుల ఆదరణ ఆధారంగా మరిన్ని బస్సులు నడుపుతామని ఆర్మూర్, పరిసర ప్రాంతాల ప్రయాణికులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. www.tgsrtcbus.in ద్వారా రిజర్వేషన్ చేసుకునే సౌకర్యం ఉందన్నారు.



## ప్రతిఒక్కరూ రక్తదానం చేసేందుకు ముందుకు రావాలి : సీపీ

**అక్షరటుడే, నిజామాబాద్ సిటీ :** ప్రతి ఒక్కరూ రక్తదానం చేసేందుకు ముందుకు వస్తే ఎంతోమంది ప్రాణాలను కాపాడిన వాళ్లమవుతామని సీపీ సాయిచైతన్య పేర్కొన్నారు. నగరంలోని ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ సారథ్యంలో పోలీస్‌శాఖ ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. యువత రక్తదానం చేసేందుకు ముందుకు రావాలని కోరారు. మనరక్తం మరొకరి ప్రాణం కాపాడుతుందనే విషయాన్ని ప్రతిఒక్కరూ గుర్తుంచుకోవాలని ఆయన సూచించారు. అందుకోసం ఎప్పుడు అవకాశం వచ్చినా రక్తదానం చేసేందుకు యువత ఉత్సాహంగా ముందుకు రావాలన్నారు. కార్యక్రమంలో ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ లిమిటెడ్ ప్రతినిధి పూర్ణ చంద్రరావు, పోలీస్ వెల్ఫేర్ ఇన్‌స్పెక్టర్ తిరుపతి, రెడ్‌క్రాస్ సొసైటీ ఛైర్మన్ ఆంజనేయులు, ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ అధికారులు మోహన్ కిషోర్, అరుణ్ కుమార్, అబ్దుల్ ఫర్హాజ్, మహేశ్ తదితరులు పాల్గొన్నారు.

## వరద బాధితులను ఆదుకుంటాం: ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి

**అక్షరటుడే, బోధన్:** వరద బాధితులను ఆదుకుంటామని మాజీ మంత్రి, బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి తెలిపారు. బోధన్ నియోజకవర్గంలోని వరద ప్రభావిత ప్రాంతాల్లో కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డి అధికారులతో కలిసి సోమవారం పర్యటించారు. గోదావరి ఉధృతి వల్ల నవీపేట్ మండలం యంచ, అల్జాపూర్, మిట్టాపూర్, కోస్లీ తదితర ప్రాంతాల్లో నీట మునిగిన పంటలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ బాధిత రైతులు, ప్రజలు ధైర్యంగా ఉండాలని సూచించారు. వరదల వల్ల నష్టపోయిన వారిని ప్రభుత్వ పరంగా అన్ని విధాలుగా ఆదుకుంటామని భరోసా కల్పించారు. వాతావరణ మార్పుల ప్రభావంతో అతి భారీ వర్షాలు కురిసిన కారణంగా శ్రీరాంసాగర్‌కు వరద పోటెత్తి గోదావరి పరీవాహక ప్రాంతాలు ముంపునకు గురయ్యాయన్నారు. నాలుగు రోజులుగా వరి పైరు, ఇతర పంటలు నీట మునిగి ఉండడం వల్ల చేతికందే పరిస్థితి లేకుండాపోయిందన్నారు. పంట నష్టం నివేదికను ప్రభుత్వానికి సమర్పిస్తామని, బాధితులకు పరిహారం అందేలా కృషి చేస్తామని చెప్పారు. ఆయన వెంట రాష్ట్ర ఉర్దూ అకాడమీ ఛైర్మన్ తాహెర్ బిన్ హందాన్, జిల్లా గ్రంథాలయ సంస్థ ఛైర్మన్ అంతిరెడ్డి రాజిరెడ్డి, నిజామాబాద్ ఆర్డీవో రాజేంద్ర కుమార్, జిల్లా వ్యవసాయాధికారి గోవిందు, వివిధ శాఖల అధికారులున్నారు.





## పదోన్నతులు బాధ్యతను పెంచుతాయి: ఎస్పీ

**అక్షరటుడే, కామారెడ్డి:** పోలీసు శాఖలో పదోన్నతులు మరింత బాధ్యతను పెంచుతాయని ఎస్పీ రాజేష్ చంద్ర అన్నారు. పోలీస్ కానిస్టేబుల్ నుండి హెడ్ కానిస్టేబుళ్లుగా పదోన్నతి పొందిన నలుగురు పోలీసులను జిల్లా పోలీస్ కార్యాలయంలో సోమవారం అభినందించి పదోన్నతి చిహ్నాలను అలంకరించారు. నస్రుల్లాబాద్ కానిస్టేబుల్ బి.వెంకటేశ్వర్లు, తాడ్వాయి కానిస్టేబుల్ ఎస్.రమేష్ గౌడ్, బీర్కూర్ కానిస్టేబుల్ జి.శ్రీనివాస్‌లకు పదోన్నతి రాగా డి.దామోదర్ రాజన్న సిరిసిల్ల జిల్లా నుండి కామారెడ్డికి వచ్చారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. పదోన్నతులు పొందిన సిబ్బంది రెట్టింపు ఉత్సాహంతో ప్రజలకు సేవలు అందించాలన్నారు. క్రమశిక్షణతో, నిబద్ధతతో విధులు నిర్వర్తించే ప్రతి ఒక్కరికీ పోలీసు శాఖలో తగిన గుర్తింపు, గౌరవం లభిస్తుందని తెలిపారు. ప్రజాసేవలో నిజాయితీగా పనిచేసే వారికి తప్పకుండా గుర్తింపు దక్కుతుందని, సీనియారిటీ ప్రకారం అందరికీ ప్రమోషన్లు లభిస్తాయని తెలిపారు.



## నూతన రేషన్‌కార్డుల పంపిణీ

**అక్షరటుడే, కోటగిరి:** ఎన్నో ఏళ్లుగా కొత్త రేషన్‌కార్డుల కోసం ఎదురుచూస్తున్న లబ్ధిదారుల కల సాకరమైందని పోతంగల్ కాంగ్రెస్ మండలాధ్యక్షుడు పుప్పాల శంకర్ అన్నారు. పోతంగల్ మండలంలోని హంగర్గ ఫారం గ్రామంలో 112 మంది లబ్ధిదారులకు సోమవారం కొత్త రేషన్‌కార్డులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నెరవేరుస్తూ వస్తోందన్నారు. చిత్తశుద్ధి ఉన్న ప్రభుత్వం కాబట్టే హామీల అమలులో నిర్లక్ష్యం చేయట్లేదని స్పష్టం చేశారు. రేషన్‌కార్డులు అందుకున్న లబ్ధిదారుల కళ్లల్లో ఆనందం కనిపిస్తోందని ఆయన పేర్కొన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి పాలనలో రాష్ట్రం సుభిక్షంగా ఉందని ఆయన వెల్లడించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ ఎజాజ్ ఖాన్, కాంగ్రెస్ గ్రామ అధ్యక్షుడు షేక్ సజ్జాత్, కాంగ్రెస్ నాయకులు దిలీప్ కుమార్, గ్రామ పెద్దలు షేక్ వలీవుద్దీన్, బాపురావు, సూరారెడ్డి, డీలర్ శంషొద్దీన్ శంషుద్దీన్, కిషన్, యూత్ నాయకులు ఫెరోజ్, నిసార్, పాషా, మజీద్ కమిటీ అధ్యక్షులు షేక్ మౌలానా, లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.



## ఎమ్మెల్యే కేవీఆర్ బహిరంగ క్షమాపణ చెప్పాలి

**అక్షరటుడే, కామారెడ్డి:** వరదలకు ప్రజల ఓవర్ కాన్ఫిడెన్స్ కారణమంటూ ప్రజలను దోషులుగా చేసిన ఎమ్మెల్యే కేవీఆర్ తక్షణమే క్షమాపణ చెప్పాలని సీపీఎం జిల్లా కార్యదర్శి చంద్రశేఖర్ డిమాండ్ చేశారు. పార్టీ కార్యాలయంలో సోమవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. కామారెడ్డి ఎమ్మెల్యే తీరు 'ఒడ్డు దాటే దాకా ఓడ మల్లన్న.. ఒడ్డు దాటిన తర్వాత బోడి మల్లన్న అన్నట్టు' ఉందన్నారు. నమ్మి ఓట్లు వేసిన ప్రజలను ప్రజల తమకు బాధలు కలిగినప్పుడు ప్రభుత్వాలను, ప్రజాప్రతినిధులను విమర్శించే హక్కు ఉంటుందన్నారు. కామారెడ్డి ప్రజలు చైతన్యవంతమైన ప్రజలని, ఇక్కడ ప్రజలను ఎంత మోసగించాలని ప్రయత్నం చేసినా ప్రజలు తిరగబడతారని హెచ్చరించారు. కార్యక్రమంలో నాయకులు వెంకట్ గౌడ్, మోతీరాం నాయక్ పాల్గొన్నారు.



## వరద బాధితులకు నిత్యావసరాల పంపిణీ

**అక్షరటుడే, బోధన్:** ఇటీవల కురిసిన భారీవర్షాలకు సాలూర మండలంలోని మందర్నా, ఖాజాపూర్, హున్సా, ఖాజాపూర్, బోధన్ మండలంలోని ఖండ్‌గావ్ గ్రామాలు వరద ముంపునకు గురయ్యాయి. ఎంతో మంది ప్రజలు నిరాశ్రయులయ్యారు. దీంతో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు మేడపాటి ప్రకాష్ రెడ్డి స్పందించారు. తన జన్మదినం సందర్భంగా తన ఫౌండేషన్ ద్వారా పలువురు బాధితులకు నిత్యావసర వస్తువులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వరద బాధితులు అధైర్యపడొద్దని బీజేపీ అండగా ఉంటుందని స్పష్టం చేశారు.




నిజామాబాద్ కలెక్టరేట్ నుంచి హైదరాబాద్ తరలివెళ్తున్న ఉద్యోగులు




కామారెడ్డి జిల్లా కేంద్రం నుంచి..

# సీపీఎస్‌ను వెంటనే రద్దు చేయాలి



తెయూ వీసీకి వినతిపత్రం అందజేస్తున్న ఉద్యోగులు



నిజామాబాద్ నగరంలోని గిరిరాజ్ కళాశాల వద్ద ఉద్యోగుల నిరసన

ఉద్యోగుల పాలిట శాపంగా మారిన సీపీఎస్‌ను వెంటనే రద్దు చేయాలని ఉద్యోగులు డిమాండ్ చేశారు. ఇందుకోసం హైదరాబాద్‌ని ఇందిరా పార్క్ వద్ద చేపట్టిన ఆందోళన కార్యక్రమానికి తరలివెళ్లారు. ఉద్యోగుల హక్కుల సాధన కోసం ఎలాంటి పోరాటానికైనా సిద్ధమని ఈ సందర్భంగా ఉద్యోగులు పేర్కొన్నారు. నిజామాబాద్, కామారెడ్డి జిల్లా కేంద్రాలతో పాటు వివిధ మండల కేంద్రాల నుంచి హైదరాబాద్‌కు తరలివెళ్లారు. అంతేకాకుండా జిల్లాలోని వివిధ కార్యాలయాల వద్ద పెన్షన్ విద్రోహ దినాన్ని పురస్కరించుకుని నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. – అక్షరటుడే, నెట్‌వర్క్



ఎల్లారెడ్డి నుంచి హైదరాబాద్‌కు తరలివెళ్లిన ఉద్యోగులు




భీమ్‌గల్ నుంచి..



కసాబ్ గల్లి రాజా గణేశ్ మండలి..



శివాజీనగర్‌లోని శ్రీ శివపుత్ర గణేశ్ మండలి



కోటగల్లిలోని శ్రీ ఓంకార్ గణేశ్ మండలి

## గణనాథుడికి ఘనంగా పూజలు..

వినాయక చవితి వేడుకలు ఉమ్మడిజిల్లాలో ఘనంగా జరుగుతున్నాయి. వాడవాడలా ప్రతిష్ఠించిన మండపాల్లో.. వినాయకుడికి భక్తులు ప్రత్యేక పూజలు చేస్తున్నారు. ఈ సందర్భంగా అనేక చోట్ల అన్నదానాలు చేశారు.

– అక్షరటుడే, ఇందూరు



శివాజీనగర్‌లోని శివసాయి గణేశ్ మండలి

## చిరుతపులిని పట్టుకోండి..



**అక్షరటుడే, ఆర్మూర్ :** పట్టణ శివారులోని పెద్దమ్మ గుడి ప్రాంతంలో చిరుత పులి సంచరిస్తోందని, దానిని పట్టుకోవాలని ఆర్మూర్ పెద్ద బజార్ ముదిరాజ్ సంఘం సభ్యులు కోరారు. ఈ మేరకు సోమవారం అటవీ శాఖ అధికారులకు వినతిపత్రం అందజేశారు. ఫారెస్ట్ అధికారులు స్పందించి.. త్వరలోనే చిరుతను పట్టుకుంటామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ముదిరాజ్ సంఘం అధ్యక్షుడు బోండ్ల సంతోష్, పెద్దమ్మతల్లి ఆలయ కమిటీ ఛైర్మన్ మచ్చేందర్, జక్కం శేఖర్, బోన్ల గోపి, జక్కం ప్రసాద్, దేవేందర్, నూతుల నర్సారెడ్డి, రాజారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.




## రోగులకు వైద్య పరీక్షలు

**అక్షరటుడే, భీమ్‌గల్:** టీబీ ముక్త్ భారత్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా వేల్పూర్ మండలం అంక్సాపూర్ గ్రామ ఉప కేంద్రంలో వైద్యశిబిరం నిర్వహించినట్లు సీహెచ్‌వో నారాయణ పేర్కొన్నారు. శిబిరంలో ఛాతి ఎక్స్‌రే, రక్త పరీక్షలు చేసినట్లు ఆయన వెల్లడించారు. మొత్తం 150 మందికి ఎక్స్‌రే, 120 మందికి తెమడ పరీక్షలు చేశామన్నారు. కార్యక్రమంలో ఎక్స్‌రే టెక్నీషియన్ సూపర్‌వైజర్ గౌస్, పర్యవేక్షకులు ఎస్తేరా, తబిత, నోడల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## లింగంపేట బాలికల ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎంగా సుజాత



**అక్షరటుడే, లింగంపేట:** మండల కేంద్రానికి చెందిన చేపూరి సుజాత సోమవారం లింగంపేట బాలికల ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎంగా పదోన్నతి పొంది బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 1992లో శ్రీ సరస్వతి శిశు మందిర్ ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయురాలిగా విధుల్లో చేరి 2003లో ప్రభుత్వ ఉపాధ్యాయురాలుగా ఎస్జీటీ సాధించానన్నారు. 23 ఏళ్ల తర్వాత హెచ్‌ఎంగా ప్రమోషన్ పొందడం ఆనందంగా ఉందన్నారు. పాఠశాల అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని ఆమె పేర్కొన్నారు. అనంతరం పాఠశాల సిబ్బంది ఆమెను సత్కరించారు. కార్యక్రమంలో పాఠశాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



## ఆర్టీసీ బీసీ ఉద్యోగుల అడ్‌హక్ కమిటీ ఏర్పాటు

**అక్షరటుడే, ఆర్మూర్:** పట్టణంలోని ఆర్టీసీ ఉద్యోగుల కార్యాలయంలో సోమవారం సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా రీజనల్ అడ్‌హక్ కమిటీని ఏర్పాటుచేశారు. కమిటీకి రీజినల్ కార్యదర్శిగా శ్రీనివాసరావు, అధ్యక్షుడిగా లక్ష్మణ్, ఛైర్మన్‌గా డీవీఎస్ చక్రవర్తి, సహాయ కార్యదర్శులుగా బీఎస్ నారాయణ, గంగాధర్, ప్రసాద్, వెంకటేష్, ఆర్గనైజింగ్ సెక్రెటరీలుగా విఠల్, లింబస్వామి, ఉపాధ్యక్షులుగా నర్సయ్య, హనుమంతరావు, కమిటీ ముఖ్య సలహాదారులుగా సీహెచ్ నరసయ్య, నాగరాజు, అనిల్, పవర్, నగేష్, యూత్ అశోక్ నియమితులయ్యారు.

## నీళ్లు లేక ప్రజల అవస్థలు.. కార్యదర్శి వివాదాస్పద వ్యాఖ్యలు




**అక్షరటుడే, కామారెడ్డి:** వరదలతో ఆగమైన ఆ తండావాసులకు అండగా ఉండాల్సిన పంచాయతీ కార్యదర్శి అటువైపు వెళ్లడం మానేశారు. తాగునీరు లేక అల్లాడుతున్నామని ఫోన్ చేస్తే వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. ఇటీవల కురిసిన భారీ వర్షాలతో వరద పలు గ్రామాలను ముంచెత్తిన విషయం తెలిసిందే. రాజంపేట మండలం ఎల్లపూర్ తండా సైతం వరదల్లో మునిగింది. దీంతో ప్రజలు తాగునీటికి సైతం తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ నేపథ్యంలో వరద బాధితులకు అండగా ఉండాల్సిన పంచాయతీ కార్యదర్శి వారిని చులకనగా చూసింది. తాగునీరు లేక అవస్థలు పడుతున్నామని గ్రామస్థులు చెబితే నోటికి వచ్చినట్లు మాట్లాడింది. వాటర్ ట్యాంకర్ తీసుకెళ్లి నీళ్లు తెచ్చుకుంటామని.. డీజిల్‌కు డబ్బులు కావాలని అడిగితే నా దగ్గర డబ్బులు లేవు.. ఎక్కడి నుంచి తేవాలంటూ ప్రశ్నించింది. నీళ్లు లేకపోతే ......... తాగమనండి అంటూ వివాదాస్పద వ్యాఖ్యలు చేసింది. ప్రస్తుతం ఆమె మాట్లాడిన మాటలకు సంబంధించిన ఆడియో వైరల్‌గా మారింది. భారీ వరదలతో తండాలో విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. ఐదు రోజులుగా కరెంట్ లేకపోవడంతో బోర్లు పని చేయడం లేదు. తాగునీరు లేక స్థానికులు అవస్థలు పడుతున్నారు. అయినా సంబంధిత జీపీ కార్యదర్శి అటువైపు వెళ్లడం లేదు. దీంతో కారోబార్ సోమవారం పంచాయతీ కార్యదర్శికి ఫోన్ చేసి తండా సమస్యలపై వివరించారు. తాగునీటి కోసం ట్యాంకర్ తీసుకు వెళ్తానని డీజిల్ డబ్బులు కావాలని కోరాడు. 'డీజిల్‌కు నా దగ్గర పైసలు లేవు. ఎక్కడి నుంచి తీసుకురావాలి.. ఐదు రోజుల నుంచి నేను రెస్ట్ తీసుకుంటున్న.. నువ్వు కూడా రెస్ట్ తీసుకో' అంటూ ఆమె కారోబార్‌కు ఉచిత సలహా ఇచ్చింది. తండా ప్రజలకు నీళ్లు ఎట్లా అని కారోబార్‌ను అడిగితే.. నీళ్లు లేకపోతే ....... తాగమనండి అంటూ వ్యాఖ్యానించింది. ప్రస్తుతం ఈ ఆడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. తమ సమస్యలపై కార్యదర్శికి బాధ్యత లేదని తండావాసులు ఆరోపిస్తున్నారు.

## పంటనష్టపోయిన రైతులకు ఆర్థికసాయం అందించాలి



**అక్షరటుడే, లింగంపేట:** మండలంలోని ఆయా గ్రామాల్లో వర్షాలకు దెబ్బతిన్న పంటలకు ఎకరాకు రూ.40వేల ఆర్థికసాయం అందజేయాలని లింగంపేట మండల టీడీపీ నాయకులు డిమాండ్ చేశారు. ఈమేరకు సోమవారం తహశీల్దార్ కార్యాలయ సిబ్బందికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆ పార్టీ మండల అధ్యక్షుడు భీమ్‌రావు మాట్లాడుతూ.. పంటనష్టపోయిన రైతులకు పరిహారం చెల్లించి మేలు చేకూర్చాలని కోరారు. కార్యక్రమంలో ఆ పార్టీ మండల ఉపాధ్యక్షుడు విశ్వేశ్వర్ శర్మ, కృష్ణ, నాణ్య నాయక్, జగ్గయ్య నాయక్, రాజు, తదితరులు పాల్గొన్నారు.

## డ్రంకన్ డ్రైవ్‌లో ఐదుగురికి జైలు శిక్ష

**అక్షరటుడే, నిజామాబాద్ సిటీ:** మద్యం తాగి వాహనాలు నడిపిన కేసులో ఐదుగురికి జైలు శిక్ష విధించినట్లు ట్రాఫిక్ సీఐ ప్రసాద్ తెలిపారు. ఇటీవల వాహన తనిఖీల్లో పలువురు డ్రంకన్ డ్రైవ్‌లో పట్టుబడినట్లు పేర్కొన్నారు. ఈ మేరకు వారిపై కేసు నమోదు చేసి, కౌన్సెలింగ్ నిర్వహించినట్లు వెల్లడించారు. అనంతరం సెకండ్ క్లాస్ మేజిస్ట్రేట్ ఎదుట హాజరుపర్చగా, ఐదుగురికి జైలు శిక్షతోపాటు మరో 31 మందికి రూ.47,000 జరిమానా విధిస్తూ మెజిస్ట్రేట్ నూర్జహాన్ తీర్పు ఇచ్చినట్లు చెప్పారు. వాహనదారులు మద్యం తాగి వాహనం నడపవద్దని ట్రాఫిక్ ఏసీపీ మస్తాన్ అలీ హెచ్చరించారు.

## ఈత చెట్టు మీద నుంచి జారిపడి గీతా కార్మికుడు మృతి

**అక్షరటుడే, నిజామాబాద్‌సిటీ:** ప్రమాదవశాత్తు ఈత చెట్టు మీద నుంచి జారిపడి కల్లు గీతా కార్మికుడు మృతి చెందాడు. ఈ ఘటన మాక్లూర్ మండలంలో చోటు చేసుకుంది. ఎస్సై రాజశేఖర్ తెలిపిన వివరాల ప్రకారం.. నిజామాబాద్ గౌడ్స్ కాలనీకి చెందిన గుడి కందుల యాదగౌడ్ వృత్తి రీత్యా గీత కార్మికుడు. కాగా.. రోజూ మాదిరిగానే ఆదివారం కల్లు గీయడానికి మాక్లూర్ మండలంలోని ఒడ్యాట్ పల్లిలోని వడ్డెట్టమ్మ ఆలయ సమీపంలో గల చెరువు కట్టమీద ఉన్న ఈత చెట్ల వద్దకు కల్లు గీయడానికి వెళ్లాడు. అయితే సాయంత్రం అయినా ఇంటికి తిరిగి రాకపోవడంతో అతని కొడుకు ప్రశాంత్, అతని స్నేహితులతో పాటు వడ్డేటమ్మ ఆలయ సమీపంలో చెరువు కట్టపై వెతుకుతుండగా అక్కడ యాద గౌడ్ మృతదేహాన్ని గుర్తించారు. దీంతో మృతుడు యాదా గౌడ్ చిన్న కొడుకు ప్రశాంత్ గౌడ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. ఈత చెట్లనుంచి కల్లు గీసే క్రమంలో ప్రమాదవశాత్తు జారిపడి తలకు గాయాలై మృతి చెందినట్లు స్థానికులు అనుమానిస్తున్నారు.